సాక్షి నిర్మల్

బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



ఆలోచనలు... ఆవిష్కరణలు

జిల్లాకు చెందిన విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రతిభ చూపారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా కథనం..

8లో▸

'సివిల్ సప్లయ్'లో సస్పెన్షన్లు

నిర్మల్: సీఎంఆర్‌లో అవకతవకలు, విధులకు గైర్హాజరు కారణాలతో పౌరసరఫరాల శాఖలో ఇద్దరిపై వేటుపడింది. జిల్లా సివిల్‌సప్లయ్ అధికారి ఎస్‌కే.మహమూద్‌అలీ కొంతకాలంగా విధులకు దూరంగా ఉన్నారు. ఉన్నతాధికారులు ఆదేశించినా జాయిన్ కాకపోవడంతో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఇదే శాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న కిరణ్‌బాబును కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1/23.1

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కబోత పెరుగుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పంచగుడిలో శివలింగం, నంది ప్రతిష్ఠాపనోత్సవాలు



వీరభద్ర స్వామి ఖడ్గాలు, దండాల ఊరేగింపు..

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి గ్రామంలో గణపతి వీరభద్రస్వామి సమేత భద్రకాళి దేవి శివ లింగం, నంది విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఉదయం యాగశాల ప్రవేశం, అంఖడ దీపారాధన, ధ్వజారోహణం, గణపతి పూజ, గోపూజ, అంకురార్పన, నంది సమారాధన, స్వస్తి పుణ్యాహవచనం నిర్వహించారు. విగ్రహాలను ప్రధాన వీదుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో పండితులు విశ్వనాథ్‌శాస్త్రి, పృథ్వీ, వికాస్, సాయిచరణ్, నిఖిల్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీపీవో పర్యటన

దస్తురాబాద్: మండలంలోని బుట్టాపూర్, మున్యాల, గోడిసిర్యాల గ్రామ పంచాయతీలను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. వేసవి సమీపిస్తున్నందున పంచాయతీ నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. బుట్టాపూర్, గోడిసిర్యాల ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. తర్వాత పంచాయతీలలో రికార్డులు తనిఖీ చేశారు. డీపీవో వెంట ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శులు మల్లేశ్, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ముగిసిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు

నిర్మల్ రూరల్:టైలరింగ్, డ్రాయింగ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు, డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించామని వివరించారు. టెలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షలు ఈ నెల 25న(ఒక రోజు), టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షలు ఈనెల 26 నుంచి 27 వరకు నిర్వహించామని తెలిపారు.

వెదురు బుట్టలపై అవగాహన



వెదురు బుట్టలపై అవగాహన కల్పిస్తున్న డీఆర్డీవో

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్, కొలాంగూడ గ్రామాల్లో డీఆర్డీవో విజయలక్ష్మి మంగళవారం పర్యటించారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే వెదురు, తుంగ తదితర సహజ వనరులతో ఉపాధి పొందే విధానాలపై అవగాహన కల్పించారు. ఆమె వెంట అధికారులు, సిబ్బంది రమేశ్, శ్రీవర్ధన్, పీర్యా ఉన్నారు.

బస్సు పునరుద్ధరించాలి

కడెం: జగిత్యాల–కడెం వయా రాయికల్, బోర్నపల్లి, బెల్లాల్, కొండుకూర్, మీదుగా కడెం వరకు బస్సు పునరుద్ధరించాలని రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొదాని వెంకటరమణ కోరారు. గ్రామస్తులతో కలిసి జగిత్యాల డిపో మేనేజర్ సునీతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోదావరిపై వంతెన ఉన్నా బస్సు సౌకర్యం లేక సుమారు పదికిపైగా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గంగన్న, యమున, మహేశ్, వెంకటేశ్, గంగవ్వ, సుగుణ తదితరులు ఉన్నారు.

కుంటాల పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం..!



వివరాలు వెల్లడిస్తున్న డీసీవో నర్సయ్య

కుంటాల: కుంటాల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌పై ఇటీవల పలువురు డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. అధికారులు అవిశ్వాసంపై సమావేశం నిర్వహించారు. ఈమేరకు డైరెక్టర్లకు నోటీసులు పంపించారు. ఉదయం 11 గంటలకు డీసీవో ఆధ్వర్యంలో నిర్వహించిన బల నిరూపణకు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. సట్ల గజ్జారాం చైర్మన్‌గా కొనసాగుతాడని, హైకోర్టు స్టే కారణంగా ఫలితం ప్రకటించలేదని డీసీవో తెలిపారు.



బాసర ట్రిపుల్‌ఐటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

గ్రహణం వీడని ట్రిపుల్ ఐటీ

- ఎవరికీ పట్టని క్యాంపస్
- వర్సిటీలో ఉండని ఇన్‌చార్జి వీసీ
- పట్నంకే పరిమితమవుతున్న అధికారులు
- ప్రాంగణంలోకి మత్తుపదార్థాలు..
- ప్రభుత్వం మారినా పరిష్కారంకాని సమస్యలు

నిర్మల్: బాసర చదువులతల్లి చెంత ఉన్న విద్యాక్షేత్రంపై పట్టింపు కరువైంది. ప్రభుత్వం మారినా.. ట్రిపుల్‌ఐటీలో పరిస్థితులు మారలేదు. సమస్యలు తెలిసిన నాయకుడే సీఎం అయినా.. ఆర్జీయూకేటీకి పట్టిన గ్రహణం వీడ లేదు. సమస్యలు లేకుండా చూడాలని నియమించిన ఉన్నతాధికారులు స్థానికంగా ఉండటం లేదు. ఎక్కడో హైదరాబాద్‌లో ఉంటూ ఫోన్‌లోనే వ్యవస్థలను నడిపిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య సయోధ్య లేకపోవడమూ పర్యవేక్షణపై ప్రభావం పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులతోపాటు ఇక్కడ కొంతమంది ఫ్యాకల్టీ సైతం ప్రాంగణంలోకి సిగరెట్, లిక్కర్ వంటి మత్తు పదార్థాలను తీసుకెళ్తున్న ఘటనలు బయట పడుతున్నాయి.

క్యాంపస్‌లోకి మత్తు పదార్థాలు..

సాధారణ విద్యాలయాల్లోకే సిగరెట్, లిక్కర్‌వంటి మత్తుపదార్థాలు తీసుకురావడానికి లేదు. అలాంటిది చుట్టూ ప్రహరీతో బయటవారు లోపలికి రావడానికి అనుమతిలేని ప్రాంగణంలోకి ఇలాంటివి అసలే అనుమతి ఉండదు. కానీ.. బాసర ట్రిపుల్ ఐటీలో ఏకంగా గంజాయి వంటి మత్తుపదార్థాలు పట్టుబడుతుండటం కలవరపెడుతోంది. గతంలో ఒకసారి విద్యార్థుల వద్ద గంజాయి పట్టుబడగా, తాజాగా సిగరెట్ తాగుతూ పట్టుబడ్డారు. సిగరెటేనా.. లేక గంజాయి కూడా ఉందన్న అనుమానాల నేపథ్యంలో దీన్ని క్రమశిక్షణ కమిటీకి అప్పగించారు. ప్రస్తుతం ఈ ఘటనపై వారు విచారణ చేస్తున్నారు. అసలు.. వర్సిటీలోకి గంజాయి, సిగరెట్లు, లిక్కర్ వంటివి ఎలా వస్తున్నాయన్న ప్రశ్నలకు మాత్రం అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. క్యాంపస్‌లోనే ఉండే ఫ్యాకల్టీ కూడా మత్తుపదార్థాలను తీసుకురావడానికి అనుమతి లేదు. కానీ.. కొంతమంది వర్సిటీలోకి తీసుకువచ్చి మద్యం సేవిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పట్నంకే పరిమితం..

తమ సమస్యలపై రెండేళ్ల క్రితం ఆర్జీయూకేటీ విద్యార్థులు తీవ్ర ఆందోళనలు చేపట్టారు. ఎవరెన్ని చెప్పినా.. వినకుండా తమ సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. చివరకు అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి దిగివచ్చారు. విద్యార్థుల సమస్యలన్నీ తీరుస్తామని హామీ ఇవ్వడంతోపాటు కొత్తగా ఇన్‌చార్జి వీసీగా వెంకటరమణ, డైరెక్టర్‌గా సతీశ్ కుమార్‌ను నియమించారు. వీరిద్దరూ విద్యార్థులకు అందుబాటులో ఉంటూ సమస్యలు లేకుండా చూస్తారని చెప్పారు. కానీ.. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ఉన్న ఇన్‌చార్జి వీసీ హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారు. స్థానికంగా ఉండటం లేదు. ఎప్పుడో ఒకసారి ఏదైనా కార్యక్రమం ఉంటే అలా వర్సిటీకి వచ్చి వెళ్తున్నారు. డైరెక్టర్ కూడా అందుబాటులో ఉండటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. వీరిద్దరి మధ్య కూడా కొంత విబేధాలు ఉన్నట్లు వర్సిటీవర్గాలు చెబుతున్నాయి.

సర్కారు చూసేదెప్పుడు..?

రెండేళ్ల క్రితం బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులు చేసిన ఆందోళనలకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు పలికింది. అప్పుడు పీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి పోలీసుల వలయాలను ఛేదించుకుంటూ గోడదూకి మరీ వర్సిటీలోకి వచ్చారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేదాకా పోరాడుతామని చెప్పారు. ఇప్పుడు సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి బాసర ట్రిపుల్‌ఐటీపై దృష్టి పెట్టాలని రెండునెలలుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. కానీ.. ఇప్పటికీ ఎలాంటి స్పందన రావడం లేదు. మరోవైపు వర్సిటీలో విద్యార్థుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. వారి సమస్యలూ అలాగే నలుగుతున్నాయి. పట్టింపులేని అధికారుల పర్యవేక్షణలో.. జైలును తలపించే నిబంధనల్లో.. విద్యార్థుల గోస బయటకు రావడం లేదు.

విజయోస్తు!

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లాలో 23 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 13,345 మంది విద్యార్థులు
- నిమిషం నిబంధన అమలు



నిర్మల్ రూరల్ :ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19 వరకు కొనసాగనున్నాయి. ఇందుకోసం జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. అయితే పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించమని స్పష్టం చేశారు. ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు కావచ్చని సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే హెల్ప్‌డెస్క్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

23 పరీక్ష కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా మొత్తం 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 13,345 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 6,535 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,810 మంది ఉన్నారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు తమ వెంట సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని సూచించారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి



తరగతి గదిని పరిశీలిస్తున్న డీఈవో, పరీక్షల సహాయ అధికారి

నిర్మల్ రూరల్: మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ పద్మతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని వసతులు కల్పించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, ఫ్యాన్ వంటి సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు అన్ని విషయాలను ఇష్టంతో, కష్టపడి చదవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చక్కగా అవగాహన చేసుకుని, ఎక్కువగా అభ్యాసం చేసి, వెనుకబడిన విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఉత్తమ ప్రతిభ కనబర్చాలని తెలిపారు. అభ్యాస దీపికలు, మాదిరి ప్రశ్న పత్రాలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు పెట్టే స్లిప్ పరీక్షలు తప్పకుండా రాయాలన్నారు. పాత ప్రశ్న పత్రాలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలని పేర్కొన్నారు.

ప్రతీ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

- టీజీబీ రీజినల్ మేనేజర్ రామారావు



బీమా చెక్కు అందిస్తున్న రామారావు

లక్ష్మణచాంద:ప్రతీ మహిళ ఒక పారిశ్రామిక వేత్తగా ఎదగాలని టీజీబీ రీజనల్ మేనేజర్ రామారావు సూచించారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రుణ మేళా ప్రత్యేక కార్యక్రమంలో 37 మహిళా సంఘాలకు రూ.కోటి రుణం అందించారు. వివిధ గ్రామాలకు చెందిన చేతి వృత్తుల వారికి రూ.10 లక్షల రుణాలు అందించారు. మండలంలోని రాచాపూర్ గ్రామానికి చెందిన జడ రాజేశ్వర్ కుటుంబానికి బీమా కింద రూ.20 లక్షలు, వడ్యాల్ తాండా గ్రామానికి చెందిన సాగర్ కుటుంబానికి రూ.2 లక్షలు, షేక్ ఇమామ్ కుటుంబానికి రూ.2.50 లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళ బ్యాంకుల ద్వారా పొందుతున్న రుణాలు సద్వినియోగం చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. నూతన ఆలోచనలతో వ్యాపారం చేయాలని తెలిపారు.

బీమా సదుపాయం..

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రత్యేక బీమా అందిస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి రూ.1,456 చెల్లించి రూ.24 లక్షల బీమా సౌకర్యం పొందాలన్నారు. ఏడాదికి రూ.1000 చెల్లించి రూ.20 లక్షల బీమా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్, సిబ్బంది శశికుమార్, ఆనంద్, ముత్యం, ఐకేపీ ఏపీఎం వాణిశ్రీ, సీసీలు వినోద్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్.. 'చేతి'కి చిక్కేనా?

- నేడు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు
- కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థిగా చిన్నం సత్యం
- బీఫాం అందజేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ
- ఎన్నికపై ఉత్కంఠ



బీఫాం అందిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల అధికారుల ఆదేశం మేరకు బుదవారం ఉదయం 11 గంటలకు జెడ్పీ సీఈవో, ప్రిసైడింగ్ అధికారి గోవింద్ ఆధ్వర్యంలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరుగనుంది.

ఎన్నికపై ఉత్కంఠ..

నూతన చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లతోపాటు ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు, ఒక బీజేపీ కౌన్సిలర్, ఒక ఇండిపెండెంట్ అవిశ్వాసానికి మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థిగా చిన్న సత్యంకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బీఫాం అందించారు. అవిశ్వాసానికి మద్దతు తెలిపినవారు చిన్న సత్యంకు మద్దతు తెలుపుతారని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇక వైస్ చైర్మన్ అభ్యర్థిపై సస్పెన్స్ కొనసాగుతోంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు మద్దతు ఇస్తున్న నేపథ్యంలో వారిలో ఒకరికి వైస్ చైర్మన్ ఇస్తారని సమాచారం. బీజేపీ కూడా వైస్ చైర్మన్ పదవి ఆశిస్తోంది. ఇదిలా ఉండగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు విప్ జారీ

ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ తమ కౌన్సిలర్లకు విప్ జారీ చేసింది. ధిక్కరిస్తే క్రమశిక్షణ చర్యలతోపాటు న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజగంగన్న తెలిపారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కావలి సంతోష్, జన్నారపు విజయలక్ష్మి, పరిమి లతకు పార్టీ విప్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ సూచనల మేరకు విప్ పత్రాలను కలెక్టర్‌కు అందజేశామని తెలిపారు.

భూసేకరణ కేసులు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్:ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ భూసేకరణ కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. జిల్లా సెషన్స్ కోర్టులో సోమవారం నిర్వహించిన సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసేకరణ పెండింగ్ కోర్టు కేసులు, తీర్పు వచ్చిన కేసులకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు నీటిపారుదల, రోడ్లు భవనాల శాఖలకు సంబంధించి ఇతర అంశాల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్‌వో గంగయ్య, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ సుశీల్, ఆర్‌అండ్‌బీ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పదవుల పందేరం

- వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు
- జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీలు..
- రెండు ఓసీ జనరల్, రెండు ఎస్సీ జనరల్, ఒకటి బీసీ జనరల్
- ఉవందుకున్న ఆశావహుల ప్రయత్నాలు

నిర్మల్‌చైన్‌గేట్:వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం పాలక వర్గాలను నియమించాలని నిర్ణయించింది. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మార్కెట్ కమిటీలను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా కొలువుదీరిన రాష్ట్ర ప్రభుత్వం పాత మార్కెట్ కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీల నియామకానికి శ్రీకారం చుట్టడంతో ఆశావహులు నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మార్కెట్ కమిటీల పదవులకు తమ పేర్లను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఆయా మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. 5 మార్కెట్ కమిటీల్లో 2 ఓసీ జనరల్, 2 ఎస్సీ జనరల్, ఒకటి బీసీ జనరల్‌కు రిజర్వు చేశారు.

18 మంది సభ్యులతో కమిటీ..

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణాల మార్కెట్ల చట్టం–1966 సెక్షన్–5(1), ప్రభుత్వనోటిఫికేషన్ ప్రకారం ప్రతీ మార్కెట్‌కు 18 మంది సభ్యులతో కూడిన మార్కెట్ కమిటీ ఏర్పాటవుతుంది. దీని పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారులు, పశుగణం, పశుగణ ఉత్పత్తిదారులు ఉంటారు. వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, అల్పసంఖ్యాక(మైనార్టీ) వర్గాలు, మహిళలై ఉండాలి. అలాగే కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు ఉండాలి. ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నలుగురు ఉండనున్నారు. మార్కెట్ పరిధిలోని పీఏసీఎస్, సహకార మార్కెటింగ్ సంఘాల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారుల్లో ఒక సభ్యుడు, జిల్లా వ్యవసాయ /ఉద్యాన/పశుసంవర్ధక/మత్స్యశాఖ అధికారుల్లో ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచుల్లో ఒకరు సభ్యులుగా ఉంటారు.

ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్..

మార్కెట్ల ఆదాయాన్ని బట్టి గ్రేడింగ్ విధానం కొనసాగుతోంది. వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రధానంగా పంటల కొనుగోలు పరంగా పన్నుతో ఆదాయం లభిస్తుంది. ఆయా మార్కెట్ల ఆదాయాన్ని బట్టి ప్రభుత్వం గ్రేడ్ ఇస్తుంది. రూ.3 కోట్లకు పైగా ఆదాయం ఉంటే దాన్ని సెలక్షన్ గ్రేడ్‌గా పరిగణిస్తుండగా డిప్యూటీ డైరెక్టర్‌స్థాయి అధికారి పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారు. రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు ఉంటే స్పెషల్ గ్రేడ్‌గా పరిగణిస్తూ ఏడీ క్యాడర్ అధికారిని నియమిస్తారు. రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటే గ్రేడ్–1గా, రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఉంటే గ్రేడ్–2గా, రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఉంటే గ్రేడ్–3గా పరిగణిస్తూ ఆయా గ్రేడ్ స్థాయిని బట్టి అధికారులను, రూ.25 లక్షల వరకు ఆదాయం లభిస్తే దానికి అసిస్టెంట్ సెక్రటరీస్థాయి అధికారిని నియమిస్తారు. జిల్లాలో భైంసా మార్కెట్లు సెలక్షన్ గ్రేడ్ కాగా, ఖానాపూర్ గ్రేడ్ 2, నిర్మల్, సారంగపూర్ గ్రేడ్–3, కుభీర్ గ్రేడ్–3 పరిధిలోకి వస్తాయి.

ఎంపిక కత్తిమీద సామే..

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పదవుల కోసం పార్టీ నేతల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. మొదటి నుంచి పార్టీలో ఉన్నవారు, కొత్తగా వచ్చిన నేతల నుంచి ఒత్తిడి మొదలైంది. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఎంపిక కాంగ్రెస్ అధినాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. అయితే పదేళ్లు అధికారంలో లేకున్నా పార్టీ వెన్నంటి ఉన్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చేలోపే పాలకవర్గాలను నియమించాలని అధిష్టానం నుంచి ఆదేశాలున్నాయి.

నిబంధనల ప్రకారమే..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్ కమిటీలను నియమిస్తాం. ప్రభుత్వం కమిటీలను నియమిస్తున్నట్లు ప్రకటించినందున.. ఎమ్మెల్యేలు, మంత్రుల ఆదేశాల మేరకు ప్రతిపాదనలు వస్తే వాటిని ప్రభుత్వానికి పంపిస్తాం. అనుమతి వస్తే వెంటనే కమిటీలను నియమిస్తాం.

– అష్వక్ అహ్మద్, మార్కెటింగ్ ఏడీ, నిర్మల్

క్రమబద్ధీకరణపై కదలిక

- మూడేళ్లక్రితం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో 26,198 మంది దరఖాస్తు

మున్సిపాలిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు..

నిర్మల్ : 15,413	భైంసా : 8,875
ఖానాపూర్ : 1,910	మొత్తం : 26,198

నిర్మల్:మూడున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్‌ఆర్‌ఎస్)కు లైన్‌క్లియర్ అయింది. ప్లాట్లు, లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు 2020లో అప్పటి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. న్యాయపరమైన అడ్డంకులు రావడంతో ఆ ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల సమీకరణలో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఈమేరకు దరఖాస్తుదారులు మార్చి 31లోగా మొత్తం ఫీజు చెల్లించి, తమ ప్లాట్లు, లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఎదురుచూపులు..

ఎల్‌ఆర్‌ఎస్ లేని లేఅవుట్లలో ప్లాట్లు కొని పాట్లు పడుతున్నవాళ్లు 2020లో ప్రభుత్వం ఇచ్చిన క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు వచ్చారు. వెంటనే ప్లాటుకు రూ.వెయ్యి చొప్పున చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఇక సర్కారు చార్జీలను చెబితే చెల్లించి రెగ్యులరైజ్ చేసుకుంటామని ఎదురుచూస్తున్నారు. మూడున్నరేళ్ల తర్వాత ప్రస్తుత సర్కారు ఎల్‌ఆర్‌ఎస్‌పై దృష్టిపెట్టడంతో మళ్లీ పాత పత్రాలను, ప్లాట్ల పేపర్లను బయటకు తీస్తున్నారు. వంద గజాలలోపు ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం గజానికి రూ.200 చొప్పున చార్జీ చెల్లించాలని, 100–300 గజాల వరకు ప్లాట్లకు గజానికి రూ.400 చొప్పున, 300 గజాల పైన ఉంటే గజానికి రూ.600 చొప్పున చార్జీలు చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది. మార్చి 31 వరకు ఈ మొత్తం రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుంది.

ఇంగ్లిష్ డ్రామా పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సోన్: మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంగ్లిష్ డ్రామా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి గెలిచినట్లు హెచ్‌ఎం వెంకన్న తెలిపారు. కార్యక్రమానికి డీన్‌గా వ్యవహరించిన విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, భాషా నైపుణ్యాన్ని పెంపొందించడానికి డ్రామా పోటీలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. డ్రామా పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన అనుముల శైలజను, విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలోఎల్టా వ్యవస్థాపకులు కొమురయ్య, ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, హెచ్‌వోడీలు అనంతలక్ష్మి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పులి సంచారం అవాస్తవం'

నేరడిగొండ(బోథ్): కుంటాల జలపాతం పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా వస్తున్న పుకార్లు అవాస్తవమని కుంటాల ఎఫ్‌బీవో సచిన్ తెలిపారు. ఇతర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్న వీడియోలను కొందరు సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేస్తున్నారని, ఇది అవాస్తవమని ఆయన పేర్కొన్నారు. చుట్టు పక్క గ్రామాల ప్రజలు, పర్యాటకులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని సూచించారు.

ఏర్పాట్లు చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాలుగా కేటాయించిన గిరిజన పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఐటీడీఏ ఏటీడీవో నిహారిక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆమె చాంబర్‌లో ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రుచితకు గోల్డ్‌మెడల్


కోచ్‌తో నామాయి రుచిత

దిలావర్‌పూర్(నిర్మల్): మండల కేంద్రానికి చెందిన జాతీయ క్రీడాకారిణి నామాయి రుచిత అసోంలో జరిగిన ఖేలో ఇండియా 2024 యూనివర్సిటీ గేమ్స్‌లో 100 మీటర్ల హార్డిల్స్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎస్ఎస్ఏసీ బెంగళూరు శిక్షణా కేంద్రంలో కోచ్ రాబర్ట్ బాబీ జార్జ్ శిక్షణలో ఇప్పటికే పది జాతీయ పతకాలు సాధించింది.

బాలల సమస్యలు, పరిష్కారాలపై చర్చ

ఆదిలాబాద్‌రూరల్: గ్రామస్థాయి నుంచి బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంబంధిత సమస్యల నిర్మూలనపై మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓల్డ్ డీఆర్‌డీఏ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మహిత స్వచ్ఛంద సంస్థ, యూనిసెఫ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన విద్యార్థులు హాజరై క్షేత్రస్థాయిలో బాలల సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. పాల్గొన్న వారిలో అంకోలి ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షయ్, సాయి చరణ్, మార్కండీ ఉన్నారు.

కలెక్టరేట్‌లో బైక్ చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బైక్ చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కలెక్టరేట్ ఆవరణలో పార్కింగ్ చేసిన బైక్‌ను నిందితులు చాకచక్యంగా అపహరించారు. విషయం సోషల్ మీడియాలో మంగళవారం చక్కర్లు కొట్టడంతో వెలుగులోకి వచ్చింది. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న మూట గణేశ్ తన బైక్ చోరీ జరిగిందంటూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ పురుషోత్తం తెలిపారు.

కప్పర్లలో పిచ్చికుక్క స్వైర విహారం

తాంసి(బోథ్): మండలంలోని కప్పర్లలో మంగళవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామానికి చెందిన కడదారపు పంచపూల, ఆశన్న,అంకుల సాయి, పోచ్చన్న, ఎర్రన్నపై దాడిచేసి గాయపర్చింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా పిచ్చికుక్కను గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపారు.

ఆలోచనలు... ఆవిష్కరణలు

నిర్మల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో కాస్త వెనుకబడి ఉంటారనే భావనను ఈ విద్యార్థులు చెరిపివేశారు. విద్య, ఆలోచన పరంగా తాము ఎక్కడా తగ్గేది లేదంటూ తమ బుర్రకు పదును పెట్టారు. రోజువారీగా ఎదుర్కొనే సమస్యలను సైన్స్ పరంగా ఏ విధంగా అధిగమించవచ్చో చూపిస్తూ భవిష్యత్ అవసరాలకు తగ్గట్లు సరికొత్త ఆవిష్కరణలను రూపొందించారు. జిల్లాకు చెందిన విద్యార్థులు మండల, జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రతిభ చూపారు. ప్రతిభా ఉంటే ఎక్కడైనా రాణించవచ్చని నిరూపించారు. భౌతిక శాస్త్రంలో సర్ సీవీరామన్ చేసిన విశేష సేవలకు గుర్తుగా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్‌డే నిర్వహించుకుంటున్నాం. నేడు జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులు రూపొందించిన పరికరాలు, వాటి ఆవశ్యకత, తదితర అంశాలతో ప్రత్యేక కథనం...

- సరికొత్త పరికరాలు రూపొందించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- నిత్యం ఎదుర్కొనే సమస్యలకు సైన్స్‌తో పరిష్కారాలు
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

పూల వ్యర్థాల వినియోగం...

పూల వ్యర్థాలను మనం ఎలా పడితే అలా పాడేస్తున్నాం. దీనివల్ల భూమి, నీటి, వాయు కాలుష్యం సంభవిస్తుంది. వీటిపై ఉండే కీటక నాశినులు, శిలీంధ్ర నాశినుల వల్ల పర్యావరణానికి, మానవులకు చాలా ప్రమాదకరం. ఈ పూల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి వాడుకునే విధానాన్ని దిలావర్‌పూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి చదువుతున్న సుమిత్, ఈశ్వర్ అనే విద్యార్థులు గైడ్ టీచర్ శ్రీ ప్రియ సహకారంతో ప్రాజెక్టును రూపొందించారు. పూల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి ధూప్ స్టిక్స్, అగర్‌బత్తీలు, సుగంధ ద్రవ్యాలు, మస్కిటో రీఫిల్లు, జీవ విచ్ఛిన్నం చెందే థర్మకోల్, వర్మికంపోస్ట్ తయారు చేశారు. ఈ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైంది.


రాష్ట్రస్థాయి అవార్డు అందుకుంటున్న సుమిత్, ఈశ్వర్

వాహన వేగాన్ని నియంత్రించే పరికరం


పరికరంతో మగ్గిడి అన్వేష్

రహదారుల్లో ప్రమాదాలు జరిగే చోట వేగ నియంత్రణ సూచికబోర్డులు పెట్టినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాలు తగ్గించేందుకు ఖానాపూర్ మండలం మస్కాపూర్ పాఠశాలకు చెందిన మగ్గిడి అన్వేష్ గైడ్ టీచర్ జాడి శ్రీనివాస్ సహకారంతో వాహన వేగాన్ని నియంత్రించే ఆటోమేటిక్ స్పీడ్ కంట్రోలింగ్ మిషన్ రూపొందించాడు. పరికరాన్ని వాహన ఇంజన్‌కు అనుసంధానం చేస్తే ఆటోమేటిక్‌గా వాహన వేగాన్ని నియంత్రిస్తుంది. ఈ పరికరం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

పంటల రక్షణకు పరికరం


షేక్ అవేజ్

పంటలను జంతువులు, అగ్ని ప్రమాదాల బారి నుంచి రక్షించేందుకు, నీటితడులు తగ్గితే ఆర్డునోయునో ఆధారిత సిస్టం ఉపయోగించి రక్షించుకునేందుకు సైన్స్ ఎగ్జిబిటును సోన్ మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న షేక్ అవేజ్ తయారు చేశాడు. ఉపాధ్యాయుడు జువ్వల శ్రీధర్ ఈ ప్రదర్శనకు గైడ్‌గా వ్యవహరించాడు. సిస్టంకు అనుసంధానించబడిన అలారం మోగడం వల్ల ఆ శబ్దానికి పశువులు భయపడి దూరంగా వెళ్లడం, అగ్ని, తేమకు సంబంధించిన నంబర్లు డిస్ప్లేలో నమోదై మొబైల్‌కు మెసేజ్, ఫోన్ వస్తుంది. దీంతో రైతులు అప్రమత్తం అవుతారు. ఈ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది.

మోడ్రన్ రోడ్డు సైడ్ బారియర్స్


వేంపల్లి స్పందన

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టాలు సంభవిస్తుంటాయి. ఇలాంటి నష్టాలు జరగకుండా లోకేశ్వరం మండలంలోని పిప్రి ఉన్నత పాఠశాల విద్యార్థి వేంపల్లి స్పందనగైడ్ టీచర్ వేణుమాధవ్ సహకారంతో మోడ్రన్ రోడ్డు సైడ్ బారియర్స్ ప్రాజెక్టును రూపొందించింది. బారికేడ్లకు ఈ పరికరాన్ని ఉపయోగించడం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. ఈ విధానాన్ని ప్రస్తుతం విదేశాల్లో మాత్రమే ఉపయోగిస్తున్నారు.

సులువుగా పంటకు ఎరువులు వేసేలా...


తయారు చేసిన పరికరంతో కార్తీక్

తాంసి(బోథ్): రైతులు పంటలకు సులువుగా ఎరువులు అందించేందుకు తాంసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి జి.కార్తీక్ నాన్ స్టీచింగ్ యూరియా డిస్పోస్ యూనిట్ అనే పరికరాన్ని తయారు చేశాడు. గత జనవరిలో జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానిక మేళాలో భాగంగా వర్చువల్ మీటింగ్ ద్వారా ప్రదర్శనలు నిర్వహించగా కార్తీక్ తయారుచేసిన పరికరం రాష్ట్రస్థాయికి ఎంపికైంది. రైతులు ఎరువులు వేయడానికి సులువుగా ఉండటంతో పాటు దీనికి అమర్చిన మరో పరికరంతో పంటచేలలో సంచరించే విషపురుగులు సైతం దగ్గరి కి రాకుండా శబ్దం చేస్తుంది. కేవలం రూ.200 ఖర్చుతో మాత్రమే తయారయ్యే పరికరం ప్రతీ రైతు ఉపయోగిస్తే కూలీల కొరత సైతం అధి గమించే అవకాశం ఉంటుందని కార్తీక్ పేర్కొంటున్నాడు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


పల్లవి

ఖానాపూర్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ఇటీవల నిర్వహించిన మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ ప్రతి భ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఆన్‌లైన్ విదానంలో బయోసైన్స్, ఫిజికల్ విభాగంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చారు. తాజాగా ఈ నెల 20న నిర్మల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఖానాపూర్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి పల్లవి ప్రథమస్థానంలో నిలిచింది.

'ఉపాధి భద్రత కోసం ఉద్యమించాలి'


అభివాదం చేస్తున్న నాయకులు

భైంసాటౌన్(ముధోల్): బీడీ కార్మికులు ఉపాధి భద్రత కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీఎస్ భూమేశ్వర్ అధ్యక్షతన మంగళవారం పట్టణంలో స్వర్ణోత్సర సంవత్సర ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కోప్టా చట్టం పేరుతో బీడి పరిశ్రమను దెబ్బతీస్తోందని, దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదముందన్నారు. ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని, లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బి.భూమన్న, ప్రధాన కార్యదర్శి బి.సూర్య శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిర్మల్ జిల్లా కార్యదర్శి రాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు ఖాజా మొయినుద్దీన్, రాజేశ్, సుప్రియ, గంగాధర్, చిట్టక్క, డి.అరుణ ఐఎఫ్ టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసు, వెంకట్ నారాయణ, అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్, రాష్ట్ర కోశాధికారి మల్లన్న పాల్గొన్నారు.

'పార్టీలకు అతీతంగా ఏకతాటిపై నిలవాలి'


నినాదాలు చేస్తున్న ఆదివాసీ పర్ధాన్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మన ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు రాజకీయంగా గుర్తింపు లభించడంతో పాటు వివిధ నామినేటెడ్ పదవులలో అవకాశాలు రావాలంటే పార్టీలకు అతీతంగా ఐక్యతతో ఏకతాటిపై నిలవాలని ఆదివాసీ పురోహిత్ పర్ధాన్ సమాజ్ నాయకులు, హీరా సుక జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్వ నగేష్, పూసం ఆనంద్‌రావ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు గుర్తింపు లేకపోవడంతో ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పర్ధాన్ సమాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి శంకర్, నాయకులు కుర్సేంగే యాదవ్‌రావ్, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, గేడం జనార్దన్, ఆర్క శేషరావ్, తదితరులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో చోరీ

- మత్తుపదార్థం స్ప్రేచేసి రూ.60వేలు అపహరణ


బాధితుడు రాకూర్ అవినాశ్

భైంసారూరల్(ముధోల్): మండలంలోని మాటేగాం సమీపంలో సినీఫక్కీలో చోరీ జరిగింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... వానల్‌పాడ్ గ్రామానికి చెందిన రాకూర్ అవినాశ్ మంగళవారం భైంసాకు వచ్చి ఏటీఎంలో డబ్బులు విత్‌డ్రా చేశాడు. బైక్‌పై వానల్‌పాడ్ వెళ్తుండగా మాటేగాం సమీపంలో గుర్తు తెలియని మహిళ, పురుషుడు అవినాశ్ వాహనాన్ని ఆపి నిర్మల్‌కు ఎలా వెళ్లాలని అడిగారు. మాటల్లో పెట్టి అతని ముఖంపై మత్తుపదార్థం స్ప్రేచేయడంతో స్పృహ కోల్పోయాడు. అతని వద్ద ఉన్న రూ.60 వేలు అపహరించారు. కొద్ది సేపటికి తేరుకున్న అవినాశ్ తన వద్ద ఉన్న డబ్బులను దొంగిలించుకుపోయారని గుర్తించి భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి'


నివాళులర్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులపై హెచ్‌డబ్ల్యూవోలు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా దళితాభివృద్ధి, బీసీ అభివృద్ధి శాఖ అధికారులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దళితాభివృద్ధి, బీసీ అభివృద్ధి శాఖ హెచ్‌డబ్ల్యూవోలతో సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా వారిని సన్నద్ధం చేయాలన్నారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ దళితాభివృద్ధి శాఖ అధికారి సునిత కుమారి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జు కొలాంగూడను సందర్శించిన అధికారులు


బోరును పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నార్నూర్: మండలంలోని భీంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బొజ్జు కొలాంగూడలో తాగునీటి కష్టాలపై మంగళవారం 'సాక్షి'లో 'చెరువునీరే దిక్కు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి స్పందించారు. మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫోన్ ద్వారా గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి ఎలాగైనా తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీఈ శ్రీనివాస్, ఏఈ సుభానిని ఆదేశించారు. అధికారులు గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యకు గల కారణాలపై ఆరా తీశారు. తాగునీటి సౌకర్యానికి రూ.4 లక్షలు ఖర్చవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆమె వెంటనే స్పందించి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. 'సాక్షి' కథనంతో తమ గ్రామానికి తాగునీటి సౌకర్యం రావడంపై గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

- ట్రిపుల్‌ఐటీలో అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న న్యూరో సైకియాట్రిస్ట్ అల్లాడి సురేశ్‌కుమార్, హాజరైన విద్యార్థులు

భైంసా: మానసిక ఒత్తిడిని జయిస్తేనే విజయతీరాలకుచేరుతామని న్యూరో సైకియార్టిస్ట్ డాక్టర్ అల్లాడి సురేశ్‌కుమార్ అన్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ-1 విద్యార్థులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు టైం మేనేజ్‌మెంట్‌పై దృష్టిపెట్టాలని సూచించారు. మొబైల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. తరచూ ఇతర అంశాలపై కాకుండా విద్యపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. తరచూ ఇతర విషయాలపై ఆలోచించకుండా చదువుపైనే దృష్టిపెట్టాలన్నారు. విజయతీరాలకు చేరే అంశాలపై దృష్టిసారించి అందుకు తగ్గట్లు కష్టపడాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ పావని, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ దత్తు, చీఫ్ వార్డెన్ శ్రీధర్, అడిషనల్ చీఫ్ వార్డెన్ సుజాత, కౌన్సిలర్ నాగలక్ష్మి, శ్రీలక్ష్మి, శివకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంద్రాదేవికి 'మెస్రం' మొక్కులు


ఇంద్రాదేవికి మొక్కుతున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఇంద్రాదేవి ఆలయంలో మెస్రం వంశీయులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కేస్లాపూర్ గ్రామానికి చెందిన మెస్రం వంశీయులతో పాటు గ్రామస్తులు వచ్చి ఇంద్రాదేవికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మెస్రం వంశ పటేల్ వెంకట్‌రావ్ మాట్లాడుతూ, నాగోబా జాతర తరువాత ఇంద్రాదేవి ఆలయంలో మొక్కులు సమర్పించడం ఆనవాయితీ అని తెలిపారు. వంశ పెద్దలు బాదిరావ్, చిత్రు, గ్రామ పెద్దలు బారిక్‌రావ్, భీంరావ్, గణేశ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

తానూరు(ముధోల్): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రీకాంత్ (20) కొంతకాలంగా మద్యానికి బానిసై ఏపనీ చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి మన్యాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహాగాంలో ఒకరు ...

భైంసారూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మహాగాంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రౌతు రాజేశ్ (32) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సృజనతో పాటు కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై...

లోకేశ్వరం(ముధోల్): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని హద్‌గాంలో చోటు చేసుకుంది. ఏఎస్సై దిగంబర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఇరగదిండ్ల పోశెట్టి (58) కొంతకాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో దులానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య పీరవ్వ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

నాణ్యత నవ్వింది.. డివైడర్ పగిలింది




ఆదిలాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా గాంధీచౌక్‌లో చేపట్టిన డివైడర్ల నిర్మాణంలో నాణ్యత డొల్లతనం బయటపడింది. నిర్మించి ఏడాది కూడా కాకుండానే పూర్తిగా పగుళ్లుతేలి బండలు బయటపడుతున్నాయి. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా ఇంజనీరింగ్ అధికారుల ధనదాహార్తికి సైతం ఈ డివైడర్ల నిర్మాణం మచ్చుతునకగా నిలుస్తోంది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్